నారీ శక్తి నేడు విశ్వవ్యాప్తమైంది. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. గృహిణిగా.. రాజకీయ నాయకురాలిగా.. ఉపాధ్యాయురాలిగా.. వైద్యురాలిగా.. ఉద్యోగిగా.. వ్యాపారవేత్తగా.. సామాజిక సేవకురాలిగా.. క్రీడాకారిణిగా.. ఇలా ఎన్నో అవతారాల్లో మహిళామణులు ప్రగతి పథంలో దూసుకుపోతున్నారు. వారి బాధ్యతకు, శక్తికి, ప్రతిభకు ప్రపంచమంతా ప్రణామం చేస్తోంది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలు తాము ఎంచుకున్న రంగంలో సాధించిన ప్రగతిని 'సాక్షి'తో పంచుకుని,.. తోటి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

- ఆరిలోవ/బీచ్‌రోడ్డు/ఏయూక్యాంపస్

మహిళామణులకు ప్రణామం



- అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న మగువలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వినూత్న విద్యకు నాంది


ఉపాధ్యాయురాలు విజయభాను

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారు కోటి విజయభాను. వినూత్న విద్యకు నాంది పలికి విద్యార్థులు మెచ్చిన గురువయ్యారు. జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు కోటి విజయభాను పాఠాలు బోధిస్తున్నారు. ఆమె 1998లో ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి వినూత్న విద్యా విధానం ద్వారా బోధన చేస్తున్నారు. అలా బోధించడంలోనే సంతోషం ఉంటుందని ఆమె చెబుతున్నారు.

సాధారణంగా పాఠశాలలో ప్రభుత్వ సిలబస్ ప్రకారం పెడగాగీ విధానంలో పాఠాలు నేర్పుతారు. ఈమె మాత్రం విద్యార్థులు సొంతంగా ఆలోచింపజేయడానికి పెడగాగీతోపాటు హ్యూటగాగీ విధానంలో విద్యా బోధన చేస్తున్నారు. ఈ విధానాన్ని ఆమె సొంతంగా నేర్చుకున్నారు. ఆ విద్యను విద్యార్థులకు నేర్పడానికి తపన పడుతున్నారు. దానికి అవసరమైన ఖర్చును సొంతంగా భరిస్తున్నారు. హ్యూటగాగీ విధానంలో పిల్లలకు ఆట, పాటల ద్వారా చదవడం, రాయడం నేర్పుతున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లం ధారాళంగా మాట్లాడిస్తున్నారు. పిల్లలకు పుట్టిన రోజులు జరిపి బహుమతులు అందిస్తున్నారు. ముఖ్యమైన రోజులు, వ్యక్తుల గురించి స్క్రీన్‌పై వివరిస్తున్నారు. విద్యార్థులకు తనకు తానే ఆలోచింపజేసి రాయడం, చదవడం, లెక్కలు చేయడం నేర్పుతున్నారు. ఇది మన దేశంలోనే అరుదైన విధానమని విజయభాను అంటున్నారు. ఇది తమ పాఠశాలకే సొంతమని తోటి ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సంతపాలెం పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్‌లో గణితం బోధిస్తున్న విజయభాను

విజయభాను రెండేళ్ల కిందట పాయకరావుపేట నుంచి బదిలీపై సంతపాలెం పాఠశాలకు వచ్చారు. తొలి ఏడాది మూడో తరగతి విద్యార్థులకు బోధించారు. ఇప్పుడు అదే బ్యాచ్ నాలుగుతో తరగతికి రావడంతో ప్రస్తుతం ఆమె అదే తరగతికి బోధిస్తున్నారు. తరగతి గదిలో రౌండ్ టేబుళ్లు, వాటిపై ల్యాప్‌టాప్, గది లోపల వందల కొలది పుస్తకాలు అమర్చిన ర్యాక్‌లు, స్క్రీన్, కంప్యూటర్, నల్లబోర్డు, ప్రింటర్, ఇన్వెంటర్, మైక్‌సెట్, ప్రొజెక్టర్, పియానో, ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిన్నింటితో ఆ తరగతి గది ఒక ప్రయోగశాలను తలపిస్తుంది. ఇది స్వీయ అభ్యసనం. ఎవరి సహాయం అవసరం లేకుండా విద్యార్థి కింది తరగతి నుంచి తనకు తానే ఆలోచించి కొత్త విషయాన్ని సొంతంగా కనుగొనేటట్లు పురిగొల్పుతున్నారు. దీని ద్వారా మంచి శాస్త్రవేత్తలుగా కొత్త విషయాలు కనుగొనేలా పిల్లలు తయారవుతారని విజయభాను ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా ఇక్కడ విద్యార్థులను లండన్‌లో విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ఆమె ఇంటరాక్ట్ చేస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి


ఉండవల్లి సుజాత మూర్తి


రచయిత, వ్యాఖ్యాత, గాయని, నటి ఇలా అనేక కళలను కలిగి ఉన్నారు నగరానికి చెందిన ఉండవల్లి సుజాత మూర్తి. కవితా సంపుటిలు తన్మయధార, కల్యాణ వీణ, కవన వృక్షం, రెండు వ్యాస సంపుటిలు రచించారు. ఆకాశవాణిలో చింతన, మహిళావాణికి వ్యాఖ్యానాలు చేశారు. వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు వ్యాఖ్యానాలను అందించారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా వ్యాఖ్యానానికి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆంధ్రశ్రీ, తెలంగాణ కళా సరస్వతి, లేడీ లెజెండ్ వంటి బిరుదులను, రెండు వందలకు పైగా పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. భారత్‌లోనే కాకుండా సింగపూర్, మలేషియా దేశాల్లో సాహిత్య రంగంలో కృషికి పురస్కారాలు స్వీకరించారు. ఇటీవల తన ఆరో పుస్తకాన్ని ఖతార్ దేశం దోహాలో ఆవిష్కరించారు.

ఆదర్శ గృహిణిగా.. వైద్యురాలిగా...


డాక్టర్ పి.యశోదాదేవి

ఎండాడలో నివసిస్తున్న డాక్టర్ పి.యశోదాదేవి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మైక్రో బయాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్నారు. ఆదర్శ గృహిణిగా భర్తతో కలిసి ఇంటి బాధ్యతను, పిల్లలు, అత్తమామల యోగా క్షేమాలను చూసుకుంటున్నారు. ఇంటి బాధ్యతలు నెరవేరుస్తూ వైద్యురాలిగా రోగులకు సేవ చేస్తున్నారు.

సేవాభావం.. విధుల్లో నిబద్ధత


పి.భవాని

కొమ్మాదిలో నివసిస్తున్న పి.భవాని విమ్స్‌లో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవయవదాన కేసులు ఎక్కువగా చూస్తుంటారు. సమయంతో పనిలేకుండా రోగులకు అవసరమైనప్పుడు అర్ధరాత్రి వేళల్లో కూడా ఆమె వారి సేవలో ఉంటున్నారు. తోటి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు అందరినీ కలుపుకుంటూ సాయమందించడంలో ముందుంటారు. వైద్య రంగంలో పదేళ్లుగా సేవాభావంతో పనిచేస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఎంవీపీకాలనీ: బీసీ, ఈడబ్ల్యూసీ వర్గాలకు చెందిన డీఎస్సీ(ఎస్‌జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంవీపీ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల సర్టిఫికెట్లతోపాటు టెట్ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని చెప్పారు. వివరాలకు 94925 69177 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ కోరారు.

ఉత్సాహంగా ర్యాలీ


బీఎన్‌ఆర్ నగర్‌లో ర్యాలీ చేస్తున్న మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సభ్యులు, మహిళలు

ఆరిలోవ: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తోటగరువు దరి బీఎన్‌ఆర్ నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మహిళలకు అవగాహన కల్పించడంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం మహిళలకు వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు శంకరరావు, సాయిరాం, స్వాతి, అధిక సంఖ్యలో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు 'హంస' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

బీచ్‌రోడ్డు: ఏపీ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ (హంస) ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు హంస అధ్యక్షుడు డి.చినబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి వేడుకలు జరుగుతాయన్నారు. మహిళలక మ్యూజికల్ చైర్, కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్ వంటి ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

క్లుప్తంగా

భవిత సెంటర్‌కు వితరణ


భవిత సెంటర్ టీచర్లకు వస్తువులు అందజేస్తున్న దాతలు

ఆరిలోవ: తోటగరువు ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఆసరాగా నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి దాతలు సహకారం అందిస్తున్నారు. సింహాచలం ప్రాంతానికి చెందిన దాతలు వారి బంధువు ఉమామహేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఈ కేంద్రానికి ప్యూర్‌ఫై వాటర్ ఫిల్టర్ వితరణ చేశారు. దాతలకు కేంద్రం టీచర్లు ఎస్.కె.సలీమ్ పాహిజీ, ఎస్.మహాలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాల సాధనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ రంగాల్లో పురోభివృద్ధి దిశగా సాగుతున్న మహిళలను దీనిలో భాగస్వామ్యులను చేసి, వారి సలహాలు, సూచనలు విద్యార్థినులతో చర్చించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే బలమైన పునాదులు వేసుకోవాలన్నారు. నేటి రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా నైపుణ్యత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్యులు ప్రజ్ఞ, డాక్టర్ అరుణ, డాక్టర్ ఎ.శిరీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

బీచ్‌రోడ్డు: 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ(ఎన్‌ఐఎఫ్‌ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో భద్రతపై క్విజ్, వ్యాసరచన, ప్రసంగ, క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కోసం బైక్ ర్యాలీ, ఉచిత కంటి వైద్య శిబిరంతోపాటు ఊహించని అగ్నిప్రమాదాలకు ఎలా స్పందించాలని ఫైర్ ఫైటింగ్ ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ కుసుమ కుమారి, జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ జి.పి.ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీనివాసరావు

ఆరిలోవ: ఓ వ్యక్తి అదృశ్యంపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 11వ వార్డు గాంధీనగర్‌కు చెందిన వానపల్లి శ్రీనివాసరావు కొన్నాళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. గత నెల 28న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఎక్కడా ఆచూకీ తెలియరాలేదు. దీంతో గురువారం ఆరిలోవ పోలీసులకు శ్రీనివాసరావు అన్నయ్య వెంకటరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు ఆచూకీ తెలిసినవారు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి?

బీచ్‌రోడ్డు: నగరంలోని ఒక హోటల్‌లో 55 ఏళ్ల మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సమాచారం. హోటల్‌లో గురువారం రాత్రి ఆమె ఆత్మహత్య చేసుకుందని ప్రచారం జరుగుతోంది. ఈ సంఘటనపై మూడో పట్టణ పోలీసులను సంప్రదించగా.. తమకు ఎటువంటి సమాచారం లేదని చెబుతున్నారు. గురువారం రాత్రి ఘటన జరిగినా శుక్రవారం నాటికి కూడా సమాచారం బయటకు పొక్కకుండా హోటల్ యాజమాన్యం జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది.

బాలికలను రక్షించండి.. చదివించండి


కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభిస్తున్న పీడీ జయదేవి తదితరులు

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఆ శాఖ పీడీ జయదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ఎంవీపీకాలనీలోని సంక్షేమ భవన్ ఎదుట ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన విజ్ఞానాన్ని, మానసిక స్థైర్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు నిర్మూలించాలి, ఆడపిల్లలను రక్షించండి-చదివించండి అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఎంవీపీకాలనీలోని సెక్టార్-9 సంక్షేమ భవన్ నుంచి సమత కళాశాల కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖతోపాటు ఇతర శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అతివలను గౌరవిద్దాం


సుహాసిని ఆనంద్‌ను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ కళాశాల దశలో విద్యనభ్యసిస్తున్న యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసాల బారిన పడకుండా, వ్యసనాలు, వ్యామోహాలకు గురి కాకుండా చదువు, ఉన్నత లక్ష్యాలపైనా దృష్టి సారించాలని సూచించారు. ఇవి పాటించే విద్యార్థులు భవిష్యత్‌లో ఆనందకరమైన జీవితం పొందుతారన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయరవీంద్ర, బీజేపీ నాయకురాలు సుహాసిని ఆనంద్‌లు మాట్లాడుతూ నవ సమాజ స్థాపనలో మహిళ పాత్ర కీలకమన్నారు. మహిళలకు స్వేచ్ఛతోపాటు లైంగిక దాడులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో ఏసీపీ నరసింహమూర్తి, సుహాసిని ఆనంద్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంవీపీ సీఐ మురళీ, పలువురు కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే మహిళా సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న అత్తిలి విమల

విశాఖ విద్య: పోరాటాలతోనే మహిళల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీ కళాశాలలో ప్రొఫెసర్ షారోన్ రాజు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ దేదీప్యమానమైన భవిష్యత్తు కోసం మహిళా సమాజం ముందుకు అడుగులు వేయాలన్నారు. దురదృష్టవశాత్తు మహిళా దినోత్సవం అందించిన స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న పార్టీలు మహిళా దినోత్సవాన్ని ఒక తంతుగా మార్చేశాయన్నారు. మహిళలపై ఇప్పటికీ అనేక రూపాల్లో హత్యాచారాలు జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో రక్షణ కల్పించే విధంగా ముందుకు సాగాలని, లేనిపక్షంలో మహిళల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ట్యాంకర్


హైవేపై ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అడ్డంగా తిరిగిన కారు

ఆరిలోవ: జాతీయ రహదారిపై జూ పార్కు, ఎండాడ పెట్రోల్ బంక్ మధ్యలో ఓ ఆయిల్ ట్యాంకర్ ముందు వెళ్తున్న కారును ఢీకొంది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. మధురవాడ వైపు నుంచి నగరానికి వస్తున్న ఓ కారును వెనుక నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఆ కారు ఒక్కసారిగా రోడ్డుపై అడ్డంగా తిరిగి డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. కారులో ఉన్న ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనలో ఢీకొన్న రెండు వాహనాల వెనుక వందల కొలది ఇతర వాహనాలు బారులు తీరాయి. కారు రోడ్డుకు అడ్డంగా తిరిగిపోవడంతో వెనుక నిలిచి వాహనాలు ముందుకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీంతో ఎండాడ కూడలి వరకు సుమారు అర కిలోమీటరుకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారు, ట్యాంకర్‌ను రోడ్డు పక్కకు తరలించారు. నిలిచిపోయిన వాహనాలను ముందుకు పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై పోలీసులకు ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవడంతో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలోని దేవకి నందన్ భవనం వద్ద మ్యాన్‌హోల్ లీకేజీ సమస్యను జీవీఎంసీ సిబ్బంది పరిష్కరించారు. డ్రైనేజీ సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ ముప్పల లక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి శుక్రవారం సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూలో విద్యార్థినుల సందడి


గీతాలాపనలో ఆచార్యులు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవం సందడిగా సాగింది. విద్యార్థినులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాలేజీ విభాగం ఆచార్యులు సైతం విద్యార్థినుల్లో ఉత్సాహం నింపేలా గీతాలు ఆలపించారు. ముఖ్య అతిథి నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి మాట్లాడుతూ యువత ఆలోచనలు మంచి ఉద్దేశం, ఉన్నత లక్ష్యాల దిశగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. కలలను సాకారం చేసుకునే దిశలో గురువుల పాఠాలు ఎంతో ఉపయోగంగా నిలుస్తాయని చెప్పారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ మహిళలు తమ సమర్థతను తాము రుజువు చేసుకోవాలన్నారు. మహిళల రక్షణకు ఏర్పడిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. మానవ హక్కుల ఉల్లంఘన ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందన్నారు. ఆచార్య ఎ.పల్లవి సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి, డాక్టర్ ఈశ్వరమ్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ మంజుల, డాక్టర్ పి.ఉష తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలి


మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర అధికారులు

మహారాణిపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు, సృజనాత్మకత, ప్రజా సంక్షేమం పట్ల చూపిస్తున్న మహిళా ఉద్యోగుల అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఆనందపురం ఎంపీడీవో జానకీ, పరిపాలనాధికారి ఎ.మంజువాణి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో మార్పులు అవసరం


సెమినార్‌లో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: ప్రపంచ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలంటే విద్యా రంగం కూడా మారాల్సిన అవసరముందని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృష్ణా కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇండస్ట్రీ-అకడమియా ఇంటర్‌ఫేస్-2025 సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిశోధనలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో అందిస్తున్న 25 సింగిల్-మేజర్ కోర్సులు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆర్గానిక్ ఫార్మింగ్ వంటి ఆధునిక, సంప్రదాయ కోర్సుల గురించి వివరించారు. అదనంగా 7 పోస్ట్-గ్రాడ్యుయేషన్ కోర్సులను ప్రస్తావించారు. పరిశ్రమల నిపుణులు సహా సుమారు 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు పారిశ్రామికాభివృద్ధిలో డీఐసీ పాత్రను వివరించారు. మత్స్య రంగంలో అవకాశాలు, సవాళ్లను మత్స్య పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు విశదీకరించారు. కార్యక్రమంలో స్ప్రింట్ మేనేజింగ్ డైరెక్టర్, అఖిల భారత ఆక్వా కల్చర్ అధ్యక్షుడు పి.పవన్‌కుమార్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఆర్.వి.రమణ, ఎస్‌బీఐ రీజనల్ బిజినెస్ చీఫ్ మేనేజర్ ఎల్.అశోక్‌కుమార్, ఐజీఐఎటీ డైరెక్టర్ బి.వినోద్‌కుమార్, హిందూ బ్యూరో చీఫ్ సుమిత్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.